

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా సుధాకర్‌రెడ్డి



ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ హైదర్‌అలీ మెడికల్ లీవ్‌లో వెళ్లారు. సోమవారం కళాశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ప్రిన్సిపల్‌గా పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల పరిపాలనను మరింత బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలను అందించడమే తన ప్రాధాన్యతగా తెలిపారు. విద్యార్థులు, బోధన సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కళాశాలలో అకడమిక్, పరిపాలనా వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ నియామకం చేసినట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సమస్యలను ఓపికగా విన్న మంత్రి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే బాధితుల సమస్యలు పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో నీటి సమస్య ఉన్న గ్రామాల వివరాలను తమకు తెలియజేయాలని ప్రజలకు తెలిపారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. నీటి సమస్య ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఎక్కడైనా నీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రస్తుతం నీటి సమస్య ఉన్న ప్రతి గ్రామంలో నూతన బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాయచోటి మండలం, యండపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కాలభైరవ స్వామి తిరుణాలకు



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండపల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలో నీటి సమస్య ఉందని మంత్రిని కోరగా వెంటనే స్పందించిన మంత్రి గ్రామంలో నూతన బోరు వేసి నీటి సమస్య పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనదృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు : జెసి



వనమిత్ర స్టాండీని ప్రారంభిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

వాట్సాప్ ద్వారా ప్రభుత్వ పాలనలో భాగంగా వాట్సాప్ మనమిత్ర స్టాండీని సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ గురువారం కలెక్టరేట్లో లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే నినాదంతో ప్రభుత్వం, వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తోందన్నారు. వాట్సాప్ ద్వారా ప్రస్తుతం దాదాపు 300కు పైగా ప్రభుత్వ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను పొందేందుకు 9552300009 నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అనే మెసేజ్ పెడితే సరిపోతుందని, తర్వాత వాట్సాప్‌లో వచ్చే సూచనల ప్రకారం ప్రజలు తమకు కావలసిన సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈ వాట్సాప్ నెంబర్ ద్వారా రెవెన్యూ, ఎపిఎస్ ఆర్‌టిసి, టిటిడిలో బుకింగ్, అన్న క్యాంటీన్లో టోకెన్ బుకింగ్, పిజిఆర్‌ఎస్ గ్రీవెన్స్ స్టేటస్, పంచాయతీ రాజ్ సేవలు, తదితర సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిఎస్‌డబ్ల్యూఎస్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి మాట్లాడుతూ వాట్సాప్ మనమిత్ర స్టాండీలను ప్రతి సచివాలయంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అవసరమైన వివిధ పౌర సేవలను సులభంగా, సమర్ధవంతంగా అందించేందుకు వాట్సాప్ గవర్నెన్స్ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని ఎన్‌ఎంయు జోనల్ అధ్యక్షులు వినోద్‌బాబు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులు ఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఐదు డిపోల నుండి భారీ ఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గత నెలలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు 38 డిమాండ్లలతో కూడిన వినతిపత్రం ఇచ్చినా, ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. అధికారులు చిన్నచిన్న కారణాలతో వేధించడం తగదని ఉద్యోగ భద్రత జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. సిబ్బందికి రావలసిన ప్రమోషన్లు వెంటనే కల్పించి పెండింగ్ డిఎలు ఎంకాష్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని అలాగే గ్యారేజ్ సిబ్బంది పైన వేధింపులు తగ్గించాలన్నారు. కార్యాలయ సిబ్బందికి సరైన కంప్యూటర్ ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కోరారు. సంస్థ నందు ఖాళీగా ఉన్న ఉద్యోగులను వెంటనే భర్తీ చేయాలని కోరారు నైట్ అవుట్ అలవెన్స్‌లను పెంచి మహిళలకు భద్రతతో



నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి ఉద్యోగులు

కూడిన రెస్ట్ రూములను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి రాజు, రీజినల్ ప్రెసిడెంట్ ఎంఎస్ రావు, రీజినల్ మహిళా నాయకులు విజయేశ్వరి, ఐదు డిపోల గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ పిలుపు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను దూకుడుగా చేస్తుందని తెలిపారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందన్నారు. కార్మిక, వ్యతిరేక విధానాలపై సంఘటిత, అసంఘటిత కార్మికులు ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు ఉద్యోగులందరూ కూడా ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులన్నిటిని తుంగలో తొక్కుతున్నారని, వాటిని కాపాడు కోవడానికి, సార్వత్రిక సమ్మెను ఉద్యోగులు కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ కార్యదర్శి పి.జాన్ ప్రసాద్, సిఐటియు ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి నగరపాటి ఆనంద్, సి.సుభాన్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఉపాధి హామీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎన్‌జిఒ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా నాయ కులు పందికాళ్ళ మణి, ఉపాధి హామీ సంఘం నాయకులు శంకర్, మధు, నారా యణ, హరి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోరా డితేనే ఉపాధి హామీ చట్టం అమలైం దన్నారు. దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ఉపాధి హామీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. 200 రోజులు పనిదినాలు కల్పించా లన్నారు. రూ.6 వేలు వేతనంతో పాటు వేసవి అలవెన్సులు ఇవ్వాలని పేర్కొన్నారు. వేసవి తాపం నుంచి తట్టుకునేందుకు కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయా లని, మేట్లకు రూ.5లు పారితోషకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికు డికి రూ 26



రైల్వేకోడూరు : సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వేలు కనీస వేతనం ఇవ్వాలని, నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని కోరారు. కార్మిక హక్కుల సాధన కోసం అన్ని రంగాల కార్మికులు ఏకమై దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. **మదనపల్లె అర్బన్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐటియుసి డివిజన్ కన్వీనర్ జి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ ఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక సర్వజన ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను భారత దేశంలోని యావత్ కార్మికవర్గం అడ్డుకో వాలన్నారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ యాజమాన్యాలకు దోచి పెట్టేందుకే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్ని తప్పుపట్టారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలు, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సమ్మెలో కార్మికులందరూ సంఘాలతో నిమిత్తం లేకుండా ఐక్యంగా పాల్గొనడం ద్వారా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, జ్యోతి, లక్ష్మి, రాజేశ్వరి, షాహీదా, రేణుక, గంగులమ్మ, అలివేలు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వడదెబ్బ, వడ గాలులకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాతావరణ శాఖ వడ గాలులు, వడదెబ్బలపై హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందని, దీనివల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రణ చేసే కేంద్రం దెబ్బతిని వడదెబ్బకు గురికావడం జరుగుతుందన్నారు. వడదెబ్బకు గురైనప్పుడు తీవ్రమైన జ్వరం, తలనొప్పి, మానసిక ఒత్తిడి పెరగడం, నీరసం, కళ్లు తిరగడం, వాంతులు, విరోచనాలు, శ్వాస తీసుకోవడం కష్టం, శరీరంపై ఎర్రని పొక్కులు రావడం, ఆపస్మరక స్థితి వంటివి ఏర్పడుతాయని అప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఎండలో తిరగడం మానేయాలని మత్తు పానీయాలు తీసుకోరాదనీ రోడ్డు మీద అమ్మే కలుషిత ఆహారం, రంగు పానీయాలు తినకూడదని కూలి పనులు చేసె వారు ఎక్కువ సమయం ఎండలో పని చేయకూడదని తెలిపారు. మంచి నీరు, పళ్ళ రసాలు, ద్రవపదార్థలు ఎక్కువగా తీసుకోవాలని అత్యవసరం ఐతే తప్ప బయటకు వెళ్ళకూడదన్నారు. ఒకవేళ వెళ్ళవలసి వస్తే గొడుగు తీసుకెళ్ళాలని, ఖద్దరు బట్టలు ధరించాలని రోజుకు కనీసం 15 గ్లాసులు నీళ్లు తాగాలని రోజుకు రెండు సార్లు స్నానం చేసి పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. భోజనం మితంగా చేస్తూ తాజా ఆహారం, కాయగూరలు తినాలని వేడి గాలులు తగలకుండా ఇంట్లోని కిటికీలు, తలుపులకు తెరలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒఆర్‌ఎస్ ద్రావణం పాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, పది సంవత్సరాల లోపు పిల్లలు, 60 సంవత్సరాల పైబడిన వారు, ఉపాధి హామీ పనులకు వెళ్లు వారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శనివారం నిర్వహించే స్వర్ణఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అన్ని పిహెచ్‌సిలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో వడదెబ్బ, వడ గాలులపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టి కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ సూచించిన సలహాలు, జాగ్రత్తలు పాటించి వడదెబ్బ, వడ గాలుల నుంచి రక్షణ పొందాలని కోరారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఉషశ్రీ

వివాహం ఓ చట్టబద్ధమైన ఒప్పందం

- పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

వివాహం సరైన వయస్సులో చేయడమనేది మంచి దాంపత్యానికి పునాది వంటిదని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి, జాండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ వై.నీలిమ రెడ్డి తెలిపారు. మంగళవారం జాండ్ల గ్రామంలో తలుపుల పిహెచ్సి ఆధ్వర్యంలో "బాల్యవివాహాలు - అనర్థాలు" అనే అంశంపై కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఇద్దరు వయోజనులైన భాగస్వాముల మధ్య హక్కులు, బాధ్యతలను సూచించే చట్టపరమైన ఒప్పందం వివాహమని అన్నారు. అయితే ప్రస్తుతం ఆడపిల్లల హానికర ఆలోచనలతో అధికంగా బాల్యవివాహాలు చోటు చేసుకోవడం శ్రేయస్కరం కాదని చెప్పారు. బాల్యవివాహాల ఫలితంగా నెలలు నిండకనే కాన్పులు, తక్కువ బరువుతో బిడ్డలు పుట్టడం, మాతా-శిశు మరణాలకు దారి తీయడం, వారికి కాన్పు సమయంలో తట్టుకునే శక్తి చాలక పోవడం, పిల్లలు పెంచే నైపుణ్యం లేక ఇబ్బంది పడడం వంటి సమస్యలు ఉంటాయన్నారు. ఇలా బాల్య వివాహాలు చేయడం మన సమాజ పురభివృద్ధికి అవరోధమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బాల్యవివహాలు వద్దు, చదువే ముందు అని కిషోర్ బాలికలకు వివరించారు. అనంతరం గ్రామంలో బాల్యవివాహాలు జరగకుండా నావంతు సహకరిస్తానని బాలికలచే పర్యవేక్షకులు ఉమ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఐసిడిఎస్ పర్యవేక్షకులు ఉమ, ఏఎన్‌ఎంలు రెడ్డిబి, కృష్ణమ్మ, స్థానిక సచివాలయ మహిళా పోలీసులు భాగ్యలక్ష్మి, దివ్య, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌రెడ్డి



హజ్ యాత్రికులతో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు

హజ్ యాత్ర క్షేమంగా సాగాలి

- రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

హజ్ యాత్ర సాఫీగా సాగాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖాన్ ఆకాంక్షించారు. రాయలసీమ జిల్లాల నుండి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి బెంగళూరు హజ్ భవనంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున ఎలాంటి అసౌకర్యం లేకుండా ఫఠాన్ ఖాదర్‌ఖాన్ ఏర్పాట్లను పరిశీలించారు. కర్ణాటక హజ్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి హజ్ యాత్రకు వెళ్ళే వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల ప్రత్యేక సలహాదారుల ఏంఏ.షరీఫ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషాలతో కలిసి హజ్ కమిటి సభ్యులకు స్కానింగ్, బ్యాగ్ ప్యాకింగ్, లోడింగ్, ట్యాగింగ్, రూమ్ అలాట్‌మెంట్, ఫుడ్ టోకన్స్ ఇలా అన్ని విధాల సౌకర్యాలను దగ్గర వుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టిడిపి నాయకులు, సామిజికవేత్త సోహెల్ బాషా, సాజిద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని మదనపల్లె ట్రాఫిక్ ఎస్ఐ శివకామిని పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టౌన్ బ్యాంక్ సర్కిల్ నందు ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలకు రికార్డులు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు లైసెన్స్ పొందాలన్నారు. ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని తద్వారా ప్రమాదాల నుండి బయట పడాలన్నారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపరాదని, పార్కింగ్ కొరకు కేటాయించిన స్థలంలోని వాహనాలను నిలపాలన్నారు. ఇప్పటికే ట్రాఫిక్ నిబంధనలపై పలుమార్లు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇక మీదట ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వారికి జరిమానాలు విధిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివగామిని



ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీలు

భారతదేశంలో పుట్టిందే ఉర్దూ భాష

ప్రజాశక్తి-వాల్మీకిపురం

భారతదేశంలో పుట్టిందే ఉర్దూ భాష అని, దీనిని దేశవ్యాప్తంగా అన్న ప్రాంతాల్లో అన్ని కులమతాల వారు వినియోగిస్తున్నారని ఉర్దూ ఉపాధ్యాయులు జవాద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం స్థానిక నాయక్‌వీధిలోని ఉర్దూ లైబ్రరీలో చలో లైబ్రరీ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉర్దూ భాష రెండవ అధికార బాషగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ బాషను గౌరవిస్తూ విద్యాబోధనలో మరింత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ఉర్దూ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సయ్యద్‌షావలి, మహబూబ్‌అలీఖాన్, నసీబ్‌జాన్, జంషీద్, సయ్యద్‌బాషా, కువైట్ బాబు, చాను, సాధిక్, హనీఫ్, మహమ్మద్ అలీ, మొహమ్మద్ సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

జెండా ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కొండామర్రిపల్లి పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన జెండాను గుర్తు తెలియని తొలగించడంపై జనసేన నాయకుడు మైఫోర్స్ మహేష్ మండి పడ్డారు. జనసేన జెండా ధ్వంసం చేసిన చోట జనసేన కార్యకర్తలతో నిరసన వ్యక్తం చేసి, అనంతరం మదనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీకి వస్తున్న ప్రజాదరణ ఓర్వలేక జనసేన జెండా తొలగించి, దిమ్మెను ధ్వంసం చేయాలని ప్రయత్నించారన్నారు. జనసేన జెండాను ముట్టు పెట్టడమంటే తమ తలలను ముట్టుకున్నట్టేనన్నారు. ఒక్క జెండా తొలగిస్తే 1000 జెండాలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అర్ధరాత్రిలో జెండాలు తొలగించడం పిరికి పంద చర్య అని, ధైర్యం ఉంటే నేరుగా జనసైనికులతో తలపడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భవ్య కిషోర్, మాలతి రమేష్, అమర నారాయణ, పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

టిడిపి సభ్యత్వ కార్డులు అందజేత

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని కొత్తపల్లి, రవిహాల్ తదితర ప్రాంతాలలో మంజూరైన టిడిపి సభ్యత్వ కార్డులను మంగళవారం టిడిపి మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ అతావుల్లా స్థానికంగా అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రికార్డ్ స్థాయిలో సభ్యతం నమోదైందన్నారు. రాష్ట్ర కేంద్రం నుంచి వచ్చిన టిడిపి సభ్యత్వ కార్డులను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. సభ్యత్వ కార్డు వల్ల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఐ ఫ్యాషన్ అధినేత ముజాహిద్ బాష, కొత్తపల్లి ఏరియా ప్రజలు పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న అతావుల్లా

కమనీయం.. శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రాల్లో ప్రథమమైన భువనగిరి శ్రీలక్ష్మీ సమేత నృసింహ స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత కమనీయంగా సాగింది. శ్రీలక్ష్మీదేవి సమేత లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్వామి వారి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కల్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు తరలి రావడంతో దారులన్నీ భువనగిరపల్లి వైపు సాగాయి. శ్రీ లక్ష్మీదేవి, శ్రీ నృసింహ స్వామి ఉత్సవ మూర్తులను తొలుత పట్టు వస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వేదపండితులు వేదమంత్రోచ్చనలతో స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న సమయంలో వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఆధ్యాత్మిక భావనతో కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. స్వామి వారు లక్ష్మీదేవికి మాంగళ్యధారణ చేసే సమయంలో భక్తులు తన్మయత్వంతో ఆ మధుర క్షణాలను వీక్షించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో వేలాదిగా భక్తులు తరలి రావడంతో కల్యాణ మహోత్సవ ప్రాంగణం ఇసుక వేసినా రాలనంతగా భక్తజన సందోహంతో నిండిపోయింది. ఒకవైపు రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికి మహిళలు, వృద్ధులు సైతం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి, పులకించిపోయారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి భువనగిరిపల్లి కోదండరామస్వామి ఆలయం నుంచి కొండపైకి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారులు పసుపులేటి వీరప్రదీప్, రమ్య దంపతులు, పసుపులేటి పవన్ కుమార్ సింధు దంపతులు ఆలయ ధర్మకర్తలతో కలిసి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. కృష్ణచైతన్య అన్నదాన ట్రస్ట్ కువైట్ అధ్యక్షులు ఇండ్లూరు వజ్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు మజ్జిగ, మంచినీరు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్వామి వారి కళ్యాణ మహెూత్సవంలో ఆలయ ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు, మహళలు పాల్గొన్నారు. కల్యాణ వేడుకలలో ముఖ్య అథితులుగా 3వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్, ప్రత్యూష దంపతులు, జనసేన నాయకులు అతికారి కృష్ణలు పాల్గొన్నారు. భువనగిరిపల్లి కొండపై మంగళవారం నిర్వహించిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అపసృతులు చోటు చేసుకోకుండా ఎఎస్‌పి మనోజ్ రామ్నాధ్ హెగ్డే ఆధ్వర్యంలో అర్బన్ సిఐ రాజా నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అర్బన్ ఎస్ఐ ఎస్.ఎల్వీ ప్రసాదరెడ్డి, ఎఎస్ఐలు ప్రసాద్ వర్మ, ఖాసీంసాబ్, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, పోలీసులు, హోంగార్డులు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో బందోబస్తు విధులను నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దేవరకొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి కుడా చైర్మన్ ముక్కా రూపా నందరెడ్డి సతీమణి వరలక్ష్మీ, వారి తనయుడు సాయివికాస్‌రెడ్డి పాల్గొన్నారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రజలు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. దేవస్థాన కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎంతో ఉత్సాహభరిత వాతా వరణం జరిగాయని అన్నారు. కల్యాణోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిం చిన ప్రతి ఒక్కరికీ ముక్కా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


గంగమ్మ జాతరలో వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్

ఘనంగా చీకలబైలు గంగమ్మ జాతర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చీకలబైలు గంగమ్మ జాతర సోమ, మంగళ వారాల్లో ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలలో మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలతో మమే కమై ప్రతీ ఒక్కరినీ పేరుపేరునా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతలో మాజీ సర్పంచ్ చంద్ర, పోతబోలు సర్పంచ్ ఈశ్వరయ్య, దుబ్బిగానిపల్లి సర్పంచ్ బుడ్డన్న, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, వైఎస్ఆర్ టియుసి వేణుగోపాల్, మహేష్, యూనస్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

అంకాళమ్మ తిరుణాల..

రైల్వేకోడూరు : పట్టణంలోని పాత బజారులో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత తిరుణాల మహోత్సవం చివరి రోజు వేలాదిమంది భక్తులతో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 9 నుంచి నేటి వరకు జరిగిన పూజా తిరణాలను భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారికి కాయ, కర్పూరం అర్పించి పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తోట కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా ఈనెల 9న జల్దీకి పోవుట,11న రక్త కపిలి, 12న పెద్ద ఊరేగింపు , 13న పూల కపిలి, పొంగు బాళ్ల నిర్వహించినట్లు వారు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా అంకాళమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించడం భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి తోట శివసాయి, తోట కుటుంబ సభ్యులు ఉంగరాల బ్రదర్స్ పాల్గొన్నారు.

రెడ్డమ్మతల్లి పున:ప్రతిష్టాపన

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం రెడ్డమ్మ దేవత పున:ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. మొదటి రోజు ఉదయం ఎనిమిది గంటలకు మాతృకా పూజ, పంచగవ్య ప్రాసనం, దీక్షా కంకణధారణ, సూత్ర వేష్టనం, పతాకబంధనం వంటి కార్యక్రమాలను గ్రామ పురోహి తులు, యాగ్నీకులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యకమంలో దాత బొమ్మిశెట్టి రెడ్డి పరంజ్యోతి, మోడెం వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్ ప్రేమకుమారి, ఎంపిటిసి రెడ్డివరప్రసాద్‌నాయుడు , ప్రజలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మల్లయ్యకొండను సందర్శిస్తున్న సందర్శకులు

మల్లయ్యకొండపై సందర్శకుల సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు, ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందిం చారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ, కుమారుడు మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ బద్దంగా పూజారులు స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెలుగు మల్లమ్మ, గౌరమ్మ ఆలయాలను సందర్శించారు. వెలుగు మల్లమ్మకు పూజారి శేఖర్, విజయనిర్మల ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందించారు.

కూలీలందరికీ పనికల్పిస్తాం: ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పని కల్పిస్తామని ఎంపిడిఒ జవహర్ బాబు పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీల భాగంగా మంగళవారం అరవీడు గ్రామంలో జరుగుతున్న పెద్దచెరువు కాలువ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న కూలీల హాజరు మస్టర్ ప్రకారం కూలీలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి బీమా యోజన పాలసీ గురించి కూలీలకు అవగాహన కల్పించారు. ఉపాధి పనుల్లో కూలీలందరూ పాల్గొని పని దినాలను పెంచాలని జాతీయ ఉపాధి హామీ పథకం పథకాన్ని అందరూ కూడా సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రామచంద్ర, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

ఆర్థిక చింతను..తీరుస్తున్న చింత చిగురు


చింత చిగురు కోస్తున్న రామాపురం గ్రామస్తులు

ప్రజాశక్తి-రామాపురం

జాతీయ రహదారిపై ఉండే చింత చెట్లు పేదవాడి ఆర్థిక చింతను తీరుస్తున్నాయి. మండలంలోని పాతరామాపురం, కన్నపువాండ్లపల్లి, కశిరెడ్డిగారిపల్లి పంచాయతీలోని వడ్డేపల్లి, సుగాలిబిడికి, సూర్యనారాయణపురం, కొత్తరోడ్డు, నారాయణపురం గ్రామాల పేద ప్రజలు మే , జూన్ నెలల్లో చింత చెట్ల నుంచి చింత చిగురును తెచ్చుకొని ఆర్థిక అవసరాలను తీర్చుకుంటున్నారు. లక్కిరెడ్డిపల్లి-రామాపురం జాతీయ రహదారికి ఇరువైపులా ఉండే చింత చెట్లకు ఉంటే చింత చిగురును ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు, పిల్లలు, యువకులు చింతచిగురును తెచ్చుకొని మరుసటి రోజు కడప, రాయచోటి ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఈ రెండు నెలల్లో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు. ఎండల తీవ్రతతో కూలీ పనులకు వెళ్లలేపోతున్నామని, కుటుంబం గడవటానికి జాతీయ రహదారిపై ఉంటే చింతచెట్లు తమకు ఆర్థిక చేయూ తనిస్తున్నాయని అంటున్నారు. మే, జూన్ నెలలో చింత చెట్టుకు చిగురు ఎక్కువగా ఉంటుందని, కడప, రాయచోటి పట్టణాల్లో చిత చిగురుకు మంచి గిరాకీ ఉంటుందని అన్నారు. గత ముప్పై ఏళ్లుగా తాము వేసవి కాలంలో చింత చెట్లపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు.



పోక్సో చట్టంపై అవగాహన అవసరం


రామాపురం : పోక్సో చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

ప్రజాశక్తి-రామాపురం

14 నుంచి 18 సంవత్సరాలు వయసుగల కిశోర బాలికలు బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని రామాపురం సెక్టర్ నల్లగుట్టపల్లి బిసి కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల హక్కులు, పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కలిగించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం2006, బాల కార్మిక నిరోధక చట్టం, బాలల విద్యా హక్కు చట్టం, 14 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్బంధ విద్యాహక్కు చట్టం, మహిళలపై బలాత్కరణ, దాడి, పోక్సో చట్టాల గురించి వివరించారు. కిశోర బాలికలు తమలక్ష్యాలను నిర్ధారించుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకును అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పార్వతమ్మ, ఆరోగ్య సిబ్బంది , కిశోర బాలికలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లలకు చదువే భద్రతనిస్తుందని అనంతపల్లె అంగన్వాడీ కార్యకర్త వనజా కుమారి పేర్కొన్నారు. ఆమె రైల్వే కోడూరు ప్రాజెక్టులోని పుల్లంపేట మండలంలోని అనంతపల్లె పంచాయతీ అనంతపల్లె గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యమ్రాన్ని నిర్వహించారు. ఆడపిల్లలు అందరూ బాగా చదువుకోవాలని, ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగని అన్నారు.బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా నష్టపోతారని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్, కిశోర బాలికలు, తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **కలికిరి:** కిశోర బాలికలు ప్రభుత్వ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వాల్మీకిపురం, కలికిరి సచివాలయం-2లో గిరిజన కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిబిరం నిర్వహించారు. కిషోర్ వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమం నాలుగవ రోజు ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్య హక్కు చట్టం, బాల్య వివాహ నిషేధ హక్కు చట్టం, బాల కార్మిక నిర్మూలన హక్కు చట్టం, ఫోక్సో కేసు గురించి వివరించి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098,112 పోలీస్ హెల్ప్ లైన్ 100 అనే వాటి పైన కిశోర బాలికలకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి బి.వజ్రావతి, అంగన్వాడీ టీచర్స్ రెడ్డిరాణి, తిరుమలమ్మ, ప్రమీల భాయ్, జ్యోతిలక్ష్మి, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** బి.కొత్తకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ, శీలంవారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం, వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఋతుక్రమ పరిశుభ్రత ,లైంగిక విద్యపై బాలికలకు అవగాహన కల్పించారు. ఋతుక్రమ పరిశుభ్రత,ఋతుస్రా వం అపోహలు, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక ప్రత్యుత్పత్తి, ఆరోగ్యం, ఆరోగ్య వంతమైన కుటుంబానికి, ఆరోగ్యవంతమైన తల్లి,కౌమార దశ బాలిక లకు ప్రత్యేక వైద్యశాలలు అనే 8 అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గౌరీ దేవి, ఎఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.


కలికిరి : బాలికలకు సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్ అరుంధతి

'అన్నదాత సుఖీభవ' కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కలకడ


కలకడ : ఎఒ లావణ్య

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలకు అర్హులైన రైతులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలకడ మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు అందించే ఈ పథకాల ద్వారా రూ.20వేలు ఆర్థిక సహాయము లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడుదలగా రైతులకు వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అన్నదాత సుఖీ భవ పథకం ద్వారా రూ.14వేలు, కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.6వేలు అందిస్తోందని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్క రైతు కూడా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించి అన్నదాత సుఖీభవకు కావలసిన దరఖాస్తును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అన్నదాత సుఖీభవ పథకానికి ఆధార్ నెంబరు, భూమి వివరాలు తర్వాత వెబ్ ల్యాండ్ సమాచా రం సరిగా ఉందో లేదో నిర్ధారించుకొని ఇకెవైసి చేయించు కోవాల న్నారు. ఇకెవైసి చేయించుకోకపోతే ఇకెవైసి ప్రక్రి యను కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఈ పథకాన్ని ప్రతి ఒక్కరైతూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పథకా నికి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే వారు, రూ.10వేలు పింఛన్ అందుకునే వారు, స్థాని క సంస్థల్లో పనిచేసే శాశ్వత ఉద్యోగులు, లాయర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, రాజ్యాంగ బద్ధమైన పదవులు కలిగిన వారు ఈ పథకానికి అనర్హులు అని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్క రైతు కూడా ఈ నెల 20 తేదీలోగా అన్నదాత పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. **వీరబల్లి :** మండలంలోని అర్హులైన వ్యవసాయ రైతులు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎం. స్వాతి తెలిపారు.ఈ నెలాఖరు విడుదల చేయనున్న ఈ పథకం కోసం వారి పరిధిలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు నెంబర్, భూమి వివరాలు, వెబ్ ల్యాండ్ సమాచారం సరిగ్గా సరిచేసుకొని ఇకెవైసి చేయడం జరుగుతుందన్నారు. ఆధార్ సీడింగ్, మ్యూటేషన్ కానీ రైతులు గ్రామ సచివాలయ పరిధిలో వివరాలను సరిచూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే పథకాలను అర్హులైన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని తెలిపారు.

అవగాహనతోనే సికిల్‌సెల్ వ్యాధి నివారణ సాధ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

అవగాహనతోనేన సికిల్ సెల్ వ్యాధి నివారణ సాధ్యమని పిహెచ్‌సి వెద్యాధికారి డాక్టర్ సానే శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ గురించి వివిధ శాఖల సిబ్బందితో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనే వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణజాల రుగ్మత అని ఇది తల్లి దండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని అన్నారు. 0 నుంచి 40 సంవత్సరాల వయసులో ఉన్నవారు పరీక్షించుకోవాలని తెలిపారు. రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం,తీవ్రమైన ఒళ్ళు, కండరాల నొప్పులు, అలసట శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. వ్యాధి నిర్ధారణ తర్వాత చికిత్స చేయించుకోవాలని తెలిపారు. 2047 సంవత్సరం నాటికి సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకై ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. మండలంలోని ప్రజలందరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి సికిల్‌సెల్ రహిత మండలంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ చంద్ర, సిహెచ్ఒ రాజా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ సానే శేఖర్

ప్రశాంతతతోనే శారీరక, మానసిక ప్రయోజనాలు

ప్రజాశక్తి-పీలేరు

మనిషి మనసు ప్రశాంతంగా ఉంటేనే శారీరక, మానసిక ప్రయోజనాలు ఉంటాయని డాక్టర్ రమేష్ తెలిపారు. మంగళవారం పీలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు హైదరాబాదు నిజాం ఇన్స్టిట్యూట్ వారు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్ హాజరై సచివాలయ సిబ్బంది రోజువారి ఏదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గించుకోవడానికి అవసరమైన సూచనలు, ఇతర వైద్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒశివశంకర్, హౌసింగ్ డిఇ రమణయ్య, సచివాలయ, మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు110 జిఒను అమలు చేయాలి

ప్రజాశక్తి -వేంపల్లె ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న ఉద్యోగులకు 110 జిఒను అమలు చేయాలని కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షులు నజీర్ హుసేన్ కోరారు. మంగళవారం మండలంలోని ఆర్‌జెయుకెటి పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తాను కలిసి కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు 110 జిఒను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నజీర్ హుసేన్ మాట్లాడుతూ ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో 2018 నుండి పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి జిఒఅమలు చేయక పోవడం వల్ల జీతాలు తక్కువగా వస్తున్నట్లు చెప్పారు. 2018 నుండి ఇప్పటి వరకు కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు సర్వీసు కలపాలని కోరారు. అలాగే సర్వీసు బట్టి రావాల్సిన రూ 40 వేలు జీతాలను ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యను పరిష్కరించాలని ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకొనేందుకు జూన్ 11,12,13 తేదిల్లో ఆయా ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలు అందరూ కలిసి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమ్మె నోటీసును ఇడుపులపాయ డైరెక్టర్ కు అందజేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రైతు జి.వెంకటరమణకి చెందిన ట్రాన్స్ ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి రాగి తీగలను తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు పోలీసులకు రైతు సమాచారం ఇచ్చారు. గత నెల కాలం నుంచి ఇప్పటి వరకు చుట్టుప్రక్కల నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని రైతులు తెలిపారు.పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లను డ్రిప్ పైపులు తరచూ చోరీలకు గురవుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ చోరీలపై నిఘా ఉంచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మృతి చెందిన మహిళ చేతిపై పచ్చబొట్టు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని ఎలకపల్లి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని మహిళను దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ రవికుమార్ మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మృతి చెందిన మహిళ చేతిపై యస్మిత అనే పేరు పచ్చబొట్టుగా ఉన్నట్లు తెలిపారు. ఈ పేరు ఎవరైనా మహిళ పచ్చబొట్టుగా వేసుకుని ఉండి కనిపించకపోయినట్లయితే రామసముద్రం పోలీసులకు సమాచారం అందించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలిపారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి-పీలేరు

జాతరకు వెళ్లి తిరిగొచ్చేలోగా ఇంట్లో దొంగలు పడి దోచుకెళ్లిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. మంగళవారం పీలేరులోని చెన్నారెడ్డి కాలనీలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు పీలేరు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. స్థానిక చెన్నారెడ్డికాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులురెడ్డి, రజనీకుమారి తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వేకువజామున వేపులబైలు లో జరుగుతున్న శ్రీఅంకాళమ్మ జాతరకు వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి, ఇంట్లోని బీరువాలోని వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండడాన్ని చూసి, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులు ఇచ్చిన వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే క్లూస్ టీంను రప్పించి చోరీ జరిగిన చోట వేలిముద్రలను సేకరించారు. ఈ ఘటనలో రూ.5 లక్షలు నగదు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.


ఎఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళ నాగమణి

వివాహ వేడుకల్లో బంగారు నగలు మాయం

-ఎఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితురాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సోదరుడి కుమార్తె వివాహానికి హాజరైన చెల్లెలు బ్యాగులోని 343 గ్రాముల బంగారు నగలు మాయమైన సంఘటన రాజంపేటలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలు రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డేని ఆశ్రయించి ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. తిరుపతికి చెందిన బాధితురాలు నాగమణి వివరాల మేరకు..ఏప్రిల్ 28న రాజంపేటలోని విద్యుత్‌నగర్‌లో నివాసమున్న తన సోదరుడు జోగి సుదర్శన్‌రెడ్డి కుమార్తె సాయినందిని వివాహానికి పాల్గొనేందుకు తన కుమార్తె వర్షిణితో హాజరైనట్లు తెలిపారు. బంగారం నగలతో కూడిన లగేజ్ బ్యాగ్‌ను తన అన్న గృహంలోని బెడ్‌రూమ్‌లో ఉన్న మంచం పైన పెట్టి బంధువులతో ముచ్చటించామన్నారు. అనంతరం మంచం పైనున్న బ్యాగును మంచం కింద భద్రపరిచామన్నారు. ఆ రాత్రి ఆగదిలోనే తన అన్న జోగిసుదర్శన్‌రెడ్డి, వదిన జోగి చెంగమ్మ, కుమార్తె వర్షిణి, పెళ్లి కుమార్తె సాయినందిని, అత్త పోలి సరోజనమ్మతో కలిసి నిద్రించినట్లు తెలిపారు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి పెళ్లి పనుల్లో నిమగ్నమై ఉన్న తాము పది గంటల సమయంలో స్నానానికి వెళ్లేందుకు బ్యాగు తెరవగా అందులో ఉన్న బంగారు నగలు కనిపించలేదని తెలిపారు. ఇదే విషయం తన అన్నతో పాటు బంధువులకు తెలిపి సిసి ఫుటేజ్‌ని పరిశీలించామన్నారు. తాము ఎవరిని గుర్తించలేకపోవడంతో అదే రోజు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తన కుమార్తె, కుమారుడుతో కలిసి తాము నిద్రించిన గదిలో వస్తువులను వెతికెందుకు ప్రయత్నించగా జోగి సుకన్య అనే మహిళ ఆ గదికి తాళం వేసి తమను అడ్డుకుందన్నారు. తాము 19 మంది మీద అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశామన్నారు. 19 మంది వద్ద 30న ఎఎస్‌పి కార్యాలయంలో వేలి గుర్తులు తీసుకున్నారన్నారని, వేలిముద్రలు తీసుకున్న తరువాత జోగి చందన, భక్తవత్సల రెడ్డి, జోగి సుదర్శన్‌రెడ్డి, జోగి తేజ కువైట్ ు వెళ్లారన్నారని పేర్కొన్నారు. ఈనెల 4న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైన తరువాత జోగి సునంద, నాశం వర్ష కువైట్ కు వెళ్ళటం తన అనుమానాలకు బలం చేకూర్చిందన్నారు. ప్రధాన అనుమానితుడు జోగి సుదర్శన్‌రెడ్డి కువైట్‌కు వెళ్లినప్పటికీ ఇండియాలో ఉన్న జోగి చెంగమ్మ, జోగి సుకన్య, సరోజనమ్మను విచారిస్తే బంగారం ఆచూకీ బయట పడుతుందని, వెంటనే ఈ దిశగా విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఎఎస్‌పిని కోరినట్లు బాధితురాలు తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : మొక్కల పెంపకం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ లావణ్య. పేర్కొన్నారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా తాడిగొట్ల గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యా ర్థులతో మొక్కలు నాటించారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. అనంతరం తాడిగొట్ల గ్రామంలో రోడ్లకు ఇరువైపులా కానుగా 20, నేరేడు 20, గుల్మోహర్2 0, ఎర్రచందనం 20, ఫెల్టోస్ రైన్ ట్రీ 20 వేప 20, మొక్కలను నాటారు. కార్యక్రమంలో కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పాండురంగ అభ్యుదయ రైతు చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు ఓబుల్ రెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.